సాక్షి సూర్యాపేట

శుక్రవారం ׀ 31 ׀ జనవరి ׀ 2025



ప్రయోగ పరీక్షలకు వేళాయే
ఇంటర్ విద్యార్థులకు ఇంగ్లిష్ ప్రయోగ పరీక్షలను శుక్ర, శనివారం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. - 8లో



'నిఫ్ట్' విద్యార్థుల సందడి
హైదరాబాద్‌లోని నిఫ్ట్‌లో ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సు అభ్యసిస్తున్న 37 మంది విద్యార్థులు గురువారం పోచంపల్లికి వచ్చారు. - 8లో



మరోసారి మహాత్మా గాంధీ..
సమాజాన్ని మార్చాలంటే మరోసారి మహాత్మా గాంధీ పుట్టాలని శాసనమండలి ఛైర్మన్ సుఖేందర్‌రెడ్డి అన్నారు. - 8లో

న్యూస్‌రీల్

మేళ్లచెరువు జాతరకు రూ.కోటి మంజూరు

మేళ్లచెరువు : మేళ్లచెరువు మండలకేంద్రంలోని శ్రీ ఇష్టకామేశ్వరీ సమేత శ్రీ స్వయంభు శంభు లింగేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాల సందర్భంగా నిర్వహించే మహాశివరాత్రి జాతరకు ప్రభుత్వం నుంచి రూ.కోటి మంజూరైనట్లు ఈఓ కొండారెడ్డి గురువారం తెలిపారు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని దేవాలయ అభివృద్ధికి నిధులు కేటాయించడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ఇరిగేషన్ అధికారులపై మంత్రి ఉత్తమ్ గరం గరం!

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ నియోజకవర్గంలో లిఫ్ట్ ఇరిగేషన్ పనులు సరిగా చేపట్టకపోవడంపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమారెడ్డి ఇంజినీరింగ్ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. గురువారం హైదరాబాద్ నుంచి మంత్రి అధికారులతో ఫోన్‌లో మాట్లాడినట్లు సమాచారం. ఎక్కడ సమస్య వస్తుందో తెలుసుకొని వెంటనే పనులు మొదలు పెట్టాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. పనులు మొదలు కాకపోవడం గురించి ఒకరిపై ఒకరు తోసిపుచ్చుకున్న జిల్లా అధికారులపై ఆయన అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం . సొంత నియోజకవర్గంలోనే పనులు కాకపోతే రాష్ట్రంలో పరిస్థితి ఏమిటని అధికారులను ప్రశ్నించినట్లు తెలిసింది. జిల్లా ఎస్ఈతో పాటు జిల్లాలోని ఇరిగేషన్ అధికారులను వెంటనే హైదరాబాద్ ఆఫీస్‌కు రావాలని ఈఎన్‌సీకి ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

మున్సిపల్ ప్రత్యేక అధికారిగా బాధ్యతల స్వీకరణ



అదనపు కలెక్టర్ రాంబాబును సన్మానిస్తున్న మున్సిపల్ అధికారులు

సూర్యాపేట: మున్సిపల్ ప్రత్యేక అధికారిగా అదనపు కలెక్టర్ రాంబాబు గురువారం సూర్యాపేట మున్సిపల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయనను మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. పెద్దగట్టు జారత పనులు, ఇంటి పన్నుల వసూలు, మున్సిపాలిటీకి ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు, అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఈఈ కిరణ్, డీఈ సత్యారావు, ఆర్వో కళ్యాణి, ఎస్ఐ సారగండ్ల శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్లు గౌసుద్దీన్, యాదగిరి, ఎస్ఎస్ఆర్ ప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గాంధీకి నివాళి

సూర్యాపేటటౌన్ : మహాత్మా గాంధీజీ వర్ధంతిని సూర్యాపేట జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సదర్భంగా జాతిపిత చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అర్మడ్ అదనపు ఎస్పీ జనార్ధన్ రెడ్డి, ఆర్ఐలు నారాయణ రాజు, నరసింహ పాల్గొన్నారు.

మోతె తహసీల్దార్ సస్పెన్షన్

భానుపురి,మోతె : కుటుంబ సభ్యులందరి అనుమతి లేకుండా అక్రమంగా పౌతి చేసిన మోతె తహసీల్దార్ సంఘమిత్రను సస్పెండ్ చేయడంతో పాటు కంప్యూటర్ ఆపరేటర్ నాగరాజును విధుల నుంచి తొలగిస్తున్నట్లు కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. అక్రమ పట్టా మార్పిడిపై సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవరావుతో విచారణ జరిపించినట్లు తెలిపారు. చివ్వెంల మండలం తిరుమలగిరికి చెందిన మట్టపల్లి వెంకటాచలం కరోనా సమయంలో మరణించారని, అతనికి మోతెలో 7.10 ఎకరాల భూమి ఉందని పేర్కొన్నారు. అతనికి ఇద్దరు భార్యలు ఉండగా మొదటి భార్య మరణించిందని, ఆమెకు రమణ, సైదమ్మ ఇద్దరు కుమార్తెలు ఉన్నారని తెలిపారు. రెండో భార్య పూలమ్మకు కుమారుడు రఘు ఉండగా, రెండవ భార్య కుమారుని పేరిట కుటుంబ సభ్యుల సర్టిఫికెట్ ఉన్నా, ఆ భూమి యూనియన్ బ్యాంక్‌లో మార్టిగేజ్ చేసి ఉన్నా అక్రమంగా మొదటి భార్య కుమార్తెలు సైదమ్మ, రమణ పేరిట మాత్రమే పౌతీ ద్వారా అక్రమంగా పట్టా మార్పిడి చేశారని తెలిపారు. దీనికి బాధ్యులైన మోతె తహసీల్దార్ సంఘమిత్రను సస్పెండ్ చేస్తున్నామని, కంప్యూటర్ ఆపరేటర్ నాగరాజును విధుల నుంచి పూర్తిగా తొలగిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

బీఆర్ఎస్ నిరసన



కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చనందుకు నిరసనగా జాతిపిత వర్ధంతి సందర్భంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం తుంగతుర్తిలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే కిశోర్ తదితరులు

గిరినగర్ గిరిజన బాలికల హాస్టల్ వార్డెన్ సస్పెన్షన్

భానుపురి (సూర్యాపేట) : జిల్లాకేంద్రంలోని గిరినగర్ గిరిజన బాలికల హాస్టల్‌లో బుధవారం విద్యార్థినులు అస్వస్థతకు గురైన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లకుండా, నాణ్యమైన వైద్యం అందించకుండా నిర్లక్ష్యం వహించిన వార్డెన్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ గురువారం ఆదేశాలు జారీ చేశారు. బుధవారం హాస్టల్ వద్ద పాఠశాల విరామ సమయంలో కొందరు విద్యార్థినులు సమోసాలు కొనుగోలు చేసి తిని అస్వస్థతకు గురయ్యారు. కాగా ప్రైవేట్ వైద్యశాలకు తీసుకువెళ్లి సరైన వైద్య సేవలు అందించకపోవడంతో వారి ఆరోగ్యం క్షీణించింది. ఈ విషయంలో నిర్లక్ష్యం వహించిన వార్డెన్‌ను కలెక్టర్ సస్పెండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

కోడ్ కూసింది..



వరంగల్- ఖమ్మం- నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో సూర్యాపేటలో ధర్మభిక్షం విగ్రహానికి ముసుగు వేస్తున్న మున్సిపల్ సిబ్బంది



హుజూర్‌నగర్‌లో రాజకీయ నాయకుల ఫ్లెక్సీని తొలగిస్తున్న సిబ్బంది

నిఘా నీడ ఏమాయే..!

- ఫిబ్రవరి 3 నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సర ప్రయోగ పరీక్షలు
- పరీక్ష కేంద్రాల్లో నేటికీ ఏర్పాటు కాని సీసీకెమెరాలు
- రెండు రోజుల్లో కెమెరాల బిగింపు పనులు పూర్తిచేస్తామంటున్న అధికారులు
- ఇంటర్ బోర్డు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్న ప్రైవేట్ యాజమాన్యాలు



ప్రభుత్వ, రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలు 46	ప్రైవేట్ కళాశాలలు 26
ప్రాక్టికల్ఎగ్జామ్స్ రాయనున్న విద్యార్థులు 8325	ప్రాక్టికల్ సెంటర్స్ 44

కోదాడ: ఇంటర్ ద్వితీయ సంవత్సర సైన్స్ విద్యార్థుల ప్రయోగ పరీక్షలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిర్వహించాలని ఇంటర్ బోర్డు తీసుకున్న నిర్ణయం అమలుకునోచుకునేలా కన్పించడంలేదు. ప్రతి కళాశాలలోని ప్రయోగశాలలో సీసీ కెమెరాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశాలు జారీ చేసినా ఎక్కడా కొలిక్కిరాలేదు. ఫిబ్రవరి 3నుంచి ప్రాక్టికల్స్ ప్రారంభంకానుండగా ఎక్కడ కూడా ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. ప్రభుత్వ కళాశాలల్లో రెండు రోజుల్లో ఏర్పాటు పనులు పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నా అది అసాధ్యమేనని కొందరు అధ్యాపకులు అంటున్నారు. సీసీ కెమెరాల ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని లేకుండా తమ కాలేజీలను వార్షిక పరీక్షల సెంటర్‌కు ఇవ్వబోమని ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు స్పష్టం చేస్తున్నాయి.

ప్రయోగశాలలే కరువు..
ఇక సీసీ కెమెరాల ఏర్పాటు ఎలా..

ఇంటర్ సైన్స్ విద్యార్థులకు ముఖ్యమైన ప్రయోగ పరీక్షల నిర్వహణను ప్రభుత్వ, రెసిడెన్షియల్, ప్రైవేట్ కళాశాలలు పూర్తిగా గాడి తప్పించాయనే విమర్శలున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న 72 కళాశాలల్లో ల్యాబ్‌ల నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. ప్రభుత్వ కళాశాలల్లో ల్యాబ్‌లు ఉన్న చోట పరికరాలు లేవు.. పరికరాలు ఉన్న చోట రసాయనాలు లేవు. ఇక ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న ఇంటర్ సైన్స్ విద్యార్థులకు ల్యాబ్ అంటే ఏమిటో తెలియకుండానే కోర్సు పూర్తి చేయడంతో పాటు ప్రాక్టికల్ పరీక్షల్లో నూటికి నూరుశాతం మార్కులు సాధిస్తున్నారనే విమర్శలున్నాయి. దీనికి చెక్ పెట్టడానికి ఇంటర్ బోర్డు ఈ ఏడాది సీసీ కెమెరాల పర్యవేక్షణలో ప్రాక్టికల్ ఎగ్జామ్స్ నిర్వహించాలని చూస్తోంది. సీసీ కెమెరాల ఏర్పాటు పనులు కొన్ని కళాశాలల్లో గురువారం రాత్రి ప్రారంభమయ్యాయి.

యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేయిస్తున్నాం

జిల్లాలోని ప్రభుత్వ కళాశాలలన్నింటిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు నిధులు మంజూరు కావడంతో యుద్ధప్రాతికన ఏర్పాటు చేయిస్తున్నాం. ప్రస్తుతం వాటిని ఏర్పాటు చేసే పనులు నడుస్తున్నాయి. రెండు రోజుల్లో వీటి ఏర్పాటు పూర్తి చేస్తాం. ప్రాక్టికల్ ఎగ్జామ్ సెంటర్ ఉన్న ప్రతి కళాశాలలో తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాల్సిందే.
– భానునాయక్, డీఐఈఓ, సూర్యాపేట

డిపార్ట్‌మెంటల్ అధికారుల నియామకమే లేదు

ఫిబ్రవరి 3 నుంచి 22 వరకు జిల్లా వ్యాప్తంగా 44 సెంటర్లలో ప్రయోగ పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. గతంలో ప్రతి సెంటర్‌కు ఆ కళాశాల ప్రిన్సిపాల్ సూపరింటెండెంట్‌గా వ్యవహరించగా ప్రభుత్వ కళాశాల అధ్యాపకుడిని డీఓ(డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్)గా నియమించేవారు. వారు అక్కడ పరీక్షల నిర్వహణను పర్యవేక్షించేవారు. ఈ సారి ల్యాబ్‌లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నందున వాటి ద్వారా ఇంటర్‌బోర్డులో ఉన్న కంట్రోల్‌రూం నుంచి పర్యవేక్షిస్తామని డీఓల నియమాకం చేయలేదు. తాజాగా సీసీ కెమెరాల ఏర్పాటు పూర్తికాకపోగా, డీఓలు కూడా లేకుండా ప్రాక్టికల్ ఎగ్జామ్స్ ఎలా నిర్వహిస్తారో అర్థం కాని పరిస్థితి నెలకొంది.

ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలి

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

భానుపురి (సూర్యాపేట) : జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ఆదేశించారు. వరంగల్ -ఖమ్మం -నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికపై గురువారం తన చాంబర్‌లో అదనపు కలెక్టర్ పి. రాంబాబు తో కలిసి వెబెక్స్ ద్వారా ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. వరంగల్ -ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేయడంతో కోడ్ అమలులోకి వచ్చిందన్నారు. ఫిబ్రవరి 3న నోటిఫికేషన్, 10న నామినేషన్లకు చివరి రోజు, 11న నామినేషన్ల స్క్రూటినీ, నామినేషన్ల ఉపసంహరణకు 13వ తేదీ చివరి రోజు అని వివరించారు. 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్, మార్చి 3న ఓట్ల లెక్కింపు ఉంటుందని తెలిపారు. జిల్లాలో 2,679 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారని, జిల్లాలో మండలానికి ఒక్కటి చొప్పున 23 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో డీఆర్‌డీఓ వివి అప్పారావు, డీపీఓ నారాయణ రెడ్డి, ఎలక్షన్ సూపరింటెండెంట్ శ్రీనివాసరాజు, ఎలక్షన్ డీటీ వేణు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీల ఏర్పాటుపై అభ్యంతరాలు తెలుపండి

సూర్యాపేట జిల్లాలో నూతనంగా ఏర్పడిన 11 గ్రామ పంచాయతీలతో మండల ప్రాదేశిక నియోజక వర్గాలు(ఎంపీటీసీలు) ఏర్పాటు చేశామని ఈనెల 31 వరకు వీటిపై అభ్యంతరాలు తెలియజేయాలని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఒక ప్రకటనలో కోరారు. వచ్చిన అభ్యంతరాలను ఫిబ్రవరి 1, 2 తేదీల్లో పరిష్కరించి 3న తుది జాబితా ప్రకటించాలని ఆదేశించారు.

అమరుల త్యాగాలతోనే స్వాతంత్ర్య ఫలాలు



అమరులకు నివాళులర్పిస్తూ మౌనం పాటిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

భానుపురి (సూర్యాపేట) : నాటి అమరుల త్యాగాలతోనే నేడు మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్య ఫలాలు అని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. గురువారం సూర్యాపేట కలెక్టరేట్ లో మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన అమరవీరుల దినోత్సవంలో అదనపు కలెక్టర్ రాంబాబు తో కలిసి కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. స్వాతంత్ర్య ఉద్యమంలో, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కాపాడుకోవటానికి ఎందరో మహనీయులు అహింస మార్గంలో పోరాడారని పేర్కొన్నారు. వారి త్యాగాలను గుర్తు చేసుకుంటూ నివాళులు అర్పించటమే కాకుండా అమరులను స్ఫూర్తి గా తీసుకొని శాంతియుతంగా, అహింసా మార్గంలో దేశానికి, ప్రజలకి సేవ చేసేందుకు ముందుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ వివి అప్పారావు, హౌసింగ్ ఈఈ ధర్మారెడ్డి, డీపీఓ నారాయణ రెడ్డి,డీఈఓ అశోక్, డీడబ్ల్యూఓ నరసింహారావు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

పెద్దగట్టు జాతరకు నిధులివ్వండి

- సీఎం రేవంత్‌రెడ్డికి ఎంపీ రఘువీర్‌రెడ్డి విజ్ఞప్తి
- శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశం



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రఘువీర్‌రెడ్డి

భానుపురి (సూర్యాపేట) : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నిర్వహించే పెద్దగట్టు (గొల్లగట్టు) జాతరకు నిధులు కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డిని నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి కోరారు. గురువారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఈ మేరకు విన్నవించారు. దీనిపై స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి ఫిబ్రవరి 16 నుంచి పెద్దగట్టు జాతర ప్రారంభం కానున్న నేపథ్యంలో ఏర్పాట్లకు కావాల్సిన నిధులకు ప్రణాళికలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. జాతరకు దేశ వ్యాప్తంగా భారీగా భక్తులు తరలిరానున్న నేపథ్యంలో మౌలిక వసతులు కల్పించాలన్నారు. గత ప్రభుత్వాల హయాంలో తాత్కాలిక ఏర్పాట్లు చేసి చేతులు దులుపుకుంటున్నారని, ఈసారి శాశ్వత ప్రాతిపదికన పనులు చేయాలని సీఎం సూచించారు. అవసరమైన చోట సీసీ రోడ్లు వేయాలని పేర్కొన్నారు.

బాలెంల పల్లె దవాఖానా పనితీరు భేష్

సూర్యాపేట: బాలెంల పల్లెదవాఖానా పనితీరు బాగుందని ఢిల్లీకి చెందిన జాతీయ జనాభా పరిశోధన కేంద్రం రీసెర్చ్ ఆఫీసర్ బి. కార్తీక్, డాక్యుమెంటేషన్ ఆఫీసర్ ఆర్. దేవరాజ్ ప్రశంసించారు. సూర్యాపేట మండలంలోని బాలెంల పల్లెదవాఖానాను వారు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా దవాఖానాలో రికార్డులను పరిశీలించారు. మందులు ఉన్నాయా, పరీక్షలు చేయడానికి వసతులు ఉన్నాయా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని గర్భిణులు, బీపీ, షుగర్ ఉన్నవారి, వయసు మీద పడిన వారి ఇళ్లకు వెళ్లి పల్లెదావాఖానాలో అన్ని రకాల పరీక్షలు చేస్తున్నారా, మందులు ఇస్తున్నారా అని అడి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం జిల్లా ప్రోగ్రాం అధికారి ఉమామహేశ్వరి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మనిరత్నం, వైద్యులు నాగలక్ష్మి, సుష్మ, ఏఎన్ఎంలు హేమలత, జానమ్మ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వాసవీ మాత శోభాయాత్ర



సూర్యాపేట జిల్లా కేంద్రంలో గురువారం వాసవీ మాత శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

జడ్జీలను కలిసిన బార్ అసోసియేషన్ సభ్యులు



సూర్యాపేట పోర్టుపోలియో జడ్జి జస్టిస్ టి.మాధవీదేవిని కలిసిన బార్ అసోసియేషన్ సభ్యులు

చివ్వెంల(సూర్యాపేట) : సూర్యాపేట బార్ అసోసియేషన్ సభ్యులు గురువారం రాష్ట్ర హైకోర్టులో పలువురు న్యాయమూర్తులను కలిశారు. జస్టిస్ టి.వినోద్, కుమార్, సూర్యాపేట పోర్ట్ పోలియో జడ్జి టి.మాధవీదేవిలతో పాటు, సూర్యాపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా విధులు నిర్వహిస్తూ ఇటీవలే బదిలీపై హైకోర్టు విజిలెన్స్ రిజిస్ట్రార్‌గా వెళ్లిన ఎస్. గోవర్ధన్ రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా సూర్యాపేట జిల్లా కోర్టు నూతన భవన నిర్మించాలని, అదనపు కోర్టులు మంజూరు చేయాలని, ప్రస్తుతం కోర్టులో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకల సుదర్శన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి దపుకు మల్లయ్య, న్యాయవాదులు జె.శశిధర్, నాయిని రామ్మోహన్‌రావు, టి.ఉమాపతి, నాతిసవీందర్ కుమార్, నంద్యాల దయాకర్ రెడ్డి, విజయ్ కుమార్, నర్సింహ, చంద్రమౌళి పాల్గొన్నారు.

ట్రైన్డ్ మీడియేటర్ కౌన్సిల్ నియామకం

చివ్వెంల(సూర్యాపేట) : సూర్యాపేట జిల్లా మీడియేషన్ సెంటర్ ట్రైన్డ్ మీడియేటర్ కౌన్సిల్ గా సూర్యాపేట జిల్లా కోర్టుకు చెందిన న్యాయవాదులు పత్తిపాక రాధాకృష్ణ, పత్తిపాక శ్రీనివాస్‌రావులను నియమిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. పెండిగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం కోసం ఇరువర్గాల కక్షిదారులతో మాట్లాడి రాజీ చేసేందుకు వీరు కృషి చేస్తారు. తుంగతుర్తి, కోదాడ, హుజూర్ నగర్ కోర్టుల పరిధిలోని కక్షిదారులకు సేవలు అందిస్తారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకల సుదర్శన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మల్లయ్య, సీనియర్, జూనియర్ న్యాయవాదులు వీరికి శుభాకాంక్షలు తెలిపారు.



పత్తిపాక రాధాకృష్ణ



పత్తిపాక శ్రీనివాస్‌రావు

కంది రైతులకు మద్దతు

తిరుమలగిరి, సూర్యాపేటలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

క్వింటాకు మద్దతు ధర రూ.7,550
- ఇ-సమృద్ధి పోర్టల్‌లో నమోదు చేసుకున్న వారే విక్రయించడానికి అర్హులు
- 2,540 ఎకరాల్లో కంది సాగు



తిరుమలగిరిలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు (ఫైల్)

తిరుమలగిరి (తుంగతుర్తి) : కందులకు మద్దతు ధర అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఇటీవల రెండు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాల్లో మద్దతు ధర క్వింటాకు రూ.7,550 దక్కనుంది. జిల్లాలో వానా కాలంలో సాగు చేసిన కంది పంట గత డిసెంబర్ నుంచి చేతికి వస్తోంది. ఈ నెల మొదటి వారం నుంచి కంది కోతలు అధికంగా కొనసాగుతున్నాయి. రైతులు కందులను అమ్మడానికి వ్యవసాయ మార్కెట్లకు వస్తున్నారు. ప్రారంభంలో కందులు క్వింటాకు రూ.8 వేలకు పైగానే ధర లభించింది.

నాణ్యతా ప్రమాణాలు	
తేమ శాతం	12
ఇతర పదార్థాలు	2 శాతం
దెబ్బ తగిలిన గింజలు	3 శాతం
రంగు పోయి దెబ్బతిన్న గింజలు	4 శాతం
పక్వంకాని గింజలు	3 శాతం
పురుగులు పట్టిన గింజలు	1 శాతం
ఇతర పంట గింజలు	3 శాతం

సూర్యాపేట, తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్లలో మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో రెండు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. ఈ రెండు కేంద్రాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో అధికారులు కొనుగోళ్లు జరుపుతారు. కొనుగోలు చేసిన కందులను మార్క్‌ఫెడ్ ద్వారా రైతుల ఖాతాల్లో డబ్బులను జమ చేస్తారు. అయితే జిల్లాలో ఇప్పటి వరకు ఈ రెండు కేంద్రాల్లో కందుల కొనుగోళ్లు జరగలేదు.

రైతులు తీసుకురావాల్సిన గుర్తింపు పత్రాలు
1. పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్
2. బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్
3. ఆధార్ కార్డు జిరాక్స్
4. ఆన్‌లైన్ పోర్టల్‌లో రైతుల ధ్రువీకరణ పత్రం

12శాతం తేమ ఉండేలా చూడాలి

కొనుగోలు కేంద్రాల్లో కందులను విక్రయించాలంటే ఇ-సమృద్ధి పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేసుకోవాలి. ఎకరాకు 3 క్వింటాళ్ల దిగుబడులు వస్తాయని అంచనా వేశాం. ఆ లెక్కన భూమి విస్తీర్ణాన్ని బట్టి దిగుబడులను కొనుగోలు చేస్తారు. 12 శాతం తేమ ఉండేలా చూడాలి.
– జ్యోతి, జిల్లా మేనేజర్, మార్క్‌ఫెడ్

ఆన్‌లైన్‌లో పేర్లు నమోదైన వారు మాత్రమే..

కనీస మద్దతు ధరకు కందులను విక్రయించే రైతులు పంట సాగుకు సంబంధించి ఇ-సమృద్ధి పోర్టల్‌లో నమోదు చేసుకున్న వారై ఉండాలి. జిల్లాలో 2,540 ఎకరాల్లో కంది సాగు చేశారు. ఈ కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వ మద్దతు ధర క్వింటాకు రూ.7,550 పొందవచ్చు. అయితే బహిరంగ మార్కెట్‌లో ప్రస్తుతం క్వింటాకు రూ.6,700 నుంచి రూ.7,000 వరకు ధర వస్తుండటంతో రైతులు ఎక్కువగా ప్రైవేట్ వ్యాపారులకే విక్రయిస్తున్నారు. దీనికి తోడు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలంటే తేమ శాతం 12లోపు ఉండాలి. నాణ్యతా ప్రమాణాలతో లోబడి ఉంటేనే మద్దతు ధర వస్తుంది.

క్లుప్తంగా

కంటెయినర్ లారీని ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు

• బస్సు డ్రైవర్‌కు తీవ్ర గాయాలు


ధ్వంసమైన ట్రావెల్స్ బస్సు ముందుభాగం

మునగాల: ఏపీలోని కాకినాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ట్రావెల్స్ బస్సు గురువారం తెల్లవారు జామున విజయవాడ–హైదరాబాద్ హైవేపై మునగాల మండలం మొద్దులచెరువు శివారులో కంటెయినర్ లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ శ్రీనివాసరావుకు బస్సు క్యాబిన్‌లో ఇరుక్కుపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానిక ఎస్‌ఐ బి. ప్రవీణ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని డ్రైవర్‌ను బయటకు తీసి 108 వాహనంలో సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు. బస్సులోని ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదు.

డ్రోన్ సహాయంతో బ్లడ్ శాంపిల్స్ తరలింపు


డ్రోన్ ద్వారా బ్లడ్ శాంపిల్స్‌ను పంపుతున్న పీహెచ్‌సీ సిబ్బంది

అడ్డగూడూరు: అడ్డగూడూరు గ్రామంలో టీబీ లక్షణాలు ఉన్న 16 మంది బ్లడ్ శాంపిల్స్ గురువారం సేకరించి డ్రోన్ సహాయంతో మొదట రామన్నపేట ఏరియా ఆస్పత్రికి, అక్కడ నుంచి బీబీనగర్ ఎయిమ్స్ ఆస్పత్రికి పంపినట్లు మండల వైద్యాధికారి భరత్ రాథోడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుమూల గ్రామాల్లో టీబీ లక్షణాలు ఉన్న వారి బ్లడ్ శాంపిల్స్ సేకరించి త్వరగా చికిత్స అందించేందుకు డ్రోన్ సేవలు ఎంతగానో దోహదపడుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎస్ శారద, సూపర్‌వైజర్ సరోజన, ఏఎన్‌ఎం మరియారాణి, ఎయిమ్స్ సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

కోదాడరూరల్: తాళం వేసిన ఇంట్లో పట్టపగలే గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన కోదాడ పట్టణంలోని శ్రీమన్నారాయణ కాలనీలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీమన్నారాయణ కాలనీకి చెందిన తాళ్లపాక హైమావతి కోదాడ పట్టణంలో ఫ్యాన్సీ షాప్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తోంది. రెండు రోజుల కిందట ఆమె తన స్వగ్రామమైన ఆకుపాములకు వెళ్లింది. ఇది గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులకొట్టి చోరీకి పాల్పడ్డారు. గురువారం ఉదయం చుట్టుపక్కల వారు పగులగొట్టి ఉండటాన్ని గమనించి హైమావతికి ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. ఆమె వచ్చి ఇంట్లో ఉన్న 5 తులాల బంగారు ఆభరణాలు, రూ.10వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కోదాడ పట్టణ పోలీసులు తెలిపారు.

'నవోదయ' ప్రవేశ పరీక్ష హాల్‌టికెట్లు విడుదల

పెద్దవూర: మండలంలోని చలకుర్తి క్యాంపు జవహర్ నవోదయ విద్యాలయంలో 2025–26 విద్యా సంవత్సరానికి గాను తొమ్మిది, పదకొండో తరగతిలో ఖాళీల భర్తీకి ఫిబ్రవరి 8వ తేదీన నిర్వహించనున్న ప్రవేశ పరీక్ష హాల్‌టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచినట్లు ప్రిన్సిపాల్ నాగభూషణం గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హాల్‌టికెట్లను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.నవోదయ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. డౌన్‌లోడ్ చేసుకునే సందర్భంలో ఏవైనా సమస్యలు ఉంటే 9652845807 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మరోసారి మహాత్మా గాంధీ పుట్టాలి

• ప్రస్తుతం రాజకీయాలు డబ్బుమయమయ్యాయి
• ప్రత్యక్ష రాజకీయాల్లో నెగ్గుకురాలేనని ఎమ్మెల్సీ పదవి తీసుకున్నా..
• శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి


పెద్దకాపర్తిలోని గాంధీ గుడిలో జరిగిన పూజల్లో పాల్గొన్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

చిట్యాల: ప్రస్తుత రాజకీయాలను, సమాజాన్ని మార్చాలంటే మరోసారి మహాత్మా గాంధీ పుట్టాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ పరిధిలోని గాంధీ గుడిలో గురువారం గాంధీ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. గాంధీ విగ్రహానికి పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం రాజకీయాలు డబ్బుమయంగా మారిపోయాయని, తాను మూడుసార్లు ఎంపీగా పనిచేసినప్పటికీ.. ప్రత్యక్ష రాజకీయాల్లో నెగ్గుకురాలేనని భావించి ఎమ్మెల్సీ పదవి తీసుకున్నానని అన్నారు. అందరూ మహాత్మా గాంధీ సూచించిన సత్యమేవ జయతే సూక్తిని ఆచరించాలని, మహాత్ముడు చూపిన బాటలో నడవాలని సూచించారు. కార్యక్రమంలో గాంధీ గుడి నిర్వాహకుడు భూపాల్‌రెడ్డి, రిటైర్డ్ ఐఆర్‌ఎస్ అధికారులు పీవీ రావు, జగదీష్‌బాబు, సంకా వెంకటేశ్వర్లు, రిటైర్డ్ డీఈఓ శివార్చక విజయ్‌కుమార్, ఆలిండియా రేడియా రిటైర్డ్ డైరెక్టర్ నాగసూరి వేణుగోపాల్, గోపాల గాంధీ బాబా తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక కార్యక్రమాలు..

గాంధీ వర్ధతి సందర్భంగా గాంధీ గుడిలో అర్చకులు కూరెళ్ల నర్సింహాచార్యులు, పవన్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న వారికి గాంధీ జీవిత చరిత్ర, గాంధీ గుడి విశేషాలను అర్చకులు వివరించారు. అనంతరం మహాత్మాగాంధీ జీవిత చరిత్ర బుర్ర కథను యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎస్‌కే బాబూజీ ఆధ్వర్యంలో ప్రేమేందర్ కళాకారుల బృందం విద్యార్థులకు వినిపించారు.

మాజీ సర్పంచ్ హత్య కేసులో నిందితుల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండ: శాలిగౌరారం మండలం ఉప్పలంచ మాజీ సర్పంచ్ బండారు మల్లయ్యను హత్య చేసిన కేసులో 12 మందిని నిందితులుగా గుర్తించగా.. అందులో ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు నల్లగొండ డీఎస్పీ కె. శివరాంరెడ్డి తెలిపారు. గురువారం నల్లగొండ జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉప్పలంచ గ్రామంలో ఎస్సీల కుల దైవం పాపమ్మ దేవతకు పూర్వీకులు కొంత భూమి వదిలిపెట్టారు. ఈ భూమిని రుద్రారపు యాదగిరి, రుద్రారపు మల్లయ్య, రుద్రారపు యాదగిరి అలియాస్ చిన్నయాదగిరి, రుద్రారపు నర్సింహ, బండారు యాదయ్య అలియాస్ టీచర్ యాదయ్య ఆక్రమించారు. ఈ విషయమై పంచాయితీ పెట్టగా.. భూమిని తిరిగి స్వాధీనం చేసుకుని చుట్టూ ఫెన్సింగ్ వేయడంతో పాటు ఆక్రమించిన వారిని కుల బహిష్కరణ చేశారు. తమను కుల బహిష్కరణ చేయడానికి మాజీ సర్పంచ్ బండారు మల్లయ్య కారణమని అతడిపై కక్ష పెంచుకున్నారు. భూమి కోల్పోయిన వారు హైదరాబాద్‌కు చెందిన సపారీ గ్యాంగ్‌తో చేతులు కలిపారు. రుద్రారపు యాదగిరి తనకు పరిచయం ఉన్న సూర్యాపేట జిల్లా నాగారం మండలం మంచిరెడ్డిపల్లికి చెందిన తాడోజు శ్రీకాంతరాజు (ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్నాడు)ను ఆశ్రయించాడు. శ్రీకాంతరాజు హైదరాబాద్‌కు చెందిన సూరారపు యాదగిరి, కొంపెల్లి చంద్రమౌళి, కొంపెల్లి శ్రీనివాస్, సూరారపు నర్సింహతో మాట్లాడి మల్లయ్యను చంపేందుకు రూ.11 లక్షలు సుపారీ నిర్ణయించి రూ.4.75 లక్షలు చెల్లించారు. వీరంతా జనవరి మొదటి వారంలో మల్లయ్యను చంపేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. మళ్లీ ఈ నెల 21వ తేదీన మల్లయ్య వ్యవసాయ బావి నుంచి బైక్‌పై ఇంటికి వస్తుండగా.. దారికాచి కర్రలతో విచక్షణారహితంగా కొట్టి చంపారు. ఈ కేసులో మొత్తం 12 మంది పాలుపంచుకోగా ఏడుగురిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని, మిగతా ఐదుగురిని త్వరలో పట్టుకుని రిమాండ్‌కు పంపుతామని డీఎస్పీ తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో శాలిగౌరారం సీఐ కొండల్ రెడ్డి, ఎస్‌ఐ సైదులు పాల్గొన్నారు.

బైక్‌లు చోరీ చేస్తున్న దొంగ..

బైక్‌లు చోరీ చేస్తున్న దొంగను నల్లగొండ టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు వివరాలను గురువారం నల్లగొండ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ శివరాంరెడ్డి విలేకరులకు వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం కలకొండ గ్రామానికి చెందిన డీకే నరసింహకు మునుగోడు మండలం వెల్మకన్నె గ్రామానికి చెందిన ఝాన్సీతో వివాహం జరిగింది. 2019 నుంచి నరసింహ వెల్మకన్నెలోని తన అత్తగారింట్లోనే ఉంటున్నాడు. నరసింహ గతంలో రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గ్యాస్ సిలిండర్ దొంగతనం చేసి జైలుకు వెళ్లి బెయిల్‌పై బయటకు వచ్చాడు. మద్యానికి, ఇతర వ్యసనాలకు బానిసైన నరసింహ బైక్‌లు చోరీ చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్‌లోని హయత్‌నగర్, వనస్థలిపురం పోలీస్ స్టేషన్లతో పాటు మునుగోడు, చౌటుప్పల్, నల్లగొండ వన్ టౌన్, టూటౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో 2 స్కూటీలు, 5 బైక్‌లు చోరీ చేసి వాటిని తక్కువ ధరకు సాగర్ రోడ్డులో బైక్ మెకానిక్ షాపు నడిపే మేడి రమేష్‌కు అమ్మి వచ్చిన డబ్బులను వ్యసనాలకు ఖర్చు పెట్టేవాడు. ఈ నెల 29వ తేదీ సాయంత్రం నల్లగొండలోని బస్టాండ్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా.. నరసింహ స్కూటీపై వెళ్తూ అనుమానాస్పదంగా కనిపించడంతో అతడిని అదుపులోకి తీసుకున్నారు. నరసింహను విచారించగా 2 స్కూటీలు, 5 బైక్‌లు దొంగిలించినట్లు నిజం ఒప్పుకున్నాడు. అతడి నుంచి రూ.5లక్షల విలువైన ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. టూటౌన్ సీఐ రాఘవరావు, ఎస్‌ఐ నాగరాజు, పోలీస్ సిబ్బంది శంకర్, బాలకోటిని ఎస్పీ అభినందించారు.

ముక్తాపూర్‌లో సినిమా షూటింగ్


షూటింగ్‌లో పాల్గొన్న హీరో సందీప్‌కిషన్

భూదాన్‌పోచంపల్లి: పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ముక్తాపూర్‌లో గురువారం సినిమా షూటింగ్ జరిగింది. హీరో సందీప్‌కిషన్ తాటిచెట్టు ఎక్కి మాట్లాడుతున్న సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ షూటింగ్‌లో జబర్దస్త్ ఫేమ్ గెటప్ శ్రీను కూడా పాల్గొన్నారు. సినిమా వివరాలను చెప్పడానికి చిత్ర యూనిట్ నిరాకరించారు. సినిమా షూటింగ్ చూడటానికి ముక్తాపూర్, రేవనపల్లి గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చారు.

విధులకు ఆటంకం.. మహిళ రిమాండ్

గుర్రంపోడు: విధులకు ఆటంకం కల్గించిన మహిళను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ పసుపులేటి మధు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్రంపోడు మండలం లక్ష్మీదేవిగూడెం గ్రామ శివారులో జరుగుతున్న 400 కేవీ విద్యుత్ టవర్ లైన్ పనులను అదే గ్రామానికి చెందిన బుర్రి పద్మ గురువారం అడ్డుకుంది. టవర్ పనులు చేస్తే పురుగుల మందు తాగుతానని ఆమె బెదిరించడంతో ట్రాన్స్‌కో ఏడీఈ వీరస్వామి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుర్రి పద్మ పురుగుల మందు తాగడానికి ప్రయత్నించగా అడ్డుకోబోయిన హోంగార్డు సుజాత చేతిని బలంగా కొరికి గాయపర్చింది. దీంతో బుర్రి పద్మను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కల్గించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

గంజాయి పట్టివేత

చౌటుప్పల్: గంజాయి విక్రయిస్తున్న యువకుడిని చౌటుప్పల్‌లోని బస్టాండ్‌లో గురువారం పోలీసులు పట్టుకున్నారు. సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం ఇందుర్తి గ్రామానికి చెందిన పందిరి సాయికుమార్ డిప్లొమా చదువుతూ మధ్యలో ఆపేశాడు. కళాశాలలో ఉన్న సమయంలోనే అతడికి గంజాయి తాగడం అలవాటు అయ్యింది. సాయికుమార్ గురువారం చౌటుప్పల్ బస్టాండ్‌లో గంజాయి విక్రయించేందుకుగాను వచ్చాడు. సమాచారం అందుకున్న పోలీసులు అతడిని పట్టుకున్నారు. అతడి వద్ద 200గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపర్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి

రామగిరి(నల్లగొండ): తాటిచెట్టు పైనుంచి జారి పడి గీత కార్మికుడు మృతిచెందాడు. ఈ ఘటన గురువారం నల్లగొండ మండలం రాములబండ గ్రామ సమీపంలో జరిగింది. రాములబండ గ్రామానికి చెందిన గీత కార్మికుడు చామకూరి వెంకన్న (51) గ్రామ సమీపంలో క్రషర్ మిల్లు వద్ద కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కగా.. ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి జారి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన వెంకన్న అక్కడికక్కడే మృతిచెందాడు. వెంకన్న మృతదేహానికి నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి భార్య ధనమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ డి. సైదాబాబు తెలిపారు.

తుంగతుర్తిలో..


రాజయ్య (ఫైల్)

తుంగతుర్తి: తుంగతుర్తి మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన గీత కార్మికుడు తండ రాజయ్య(43) గురువారం తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా.. ప్రమాదవశాత్తు జారి కిందపడి మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రైలు నుంచి జారిపడి ఇద్దరు హిజ్రాలు మృతి

యాదగిరిగుట్ట రూరల్: రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి ఇద్దరు హిజ్రాలు మృతిచెందారు. ఈ ఘటన భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలంలోని వంగపల్లి–రాయగిరి ప్రాంతంలో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వెస్ట్ బెంగాల్, బిహార్ రాష్ట్రాలకు చెందిన ఆకాశ్ కుమార్(24) నంద(25) అనే ఇద్దరు హిజ్రాలు సికింద్రాబాద్ నుంచి వరంగల్ వైపు వెళ్తున్న దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ రైలులో రాత్రి ఒంటి గంట సమయంలో ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో రైలు వంగపల్లి సమీపంలోకి రాగానే 250 మైలు రాయి సమీపంలో ఇద్దరు హిజ్రాలు ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి కింద పడిపోయి అక్కడికక్కడే మృతిచెందారు. రైలు డోర్ వద్ద కూర్చుని ప్రయాణం సాగించడం వల్లనే హిజ్రాలు కింద పడి మృతిచెందారని జీఆర్‌పీ సిబ్బంది భావిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అందజేసినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

జూదరుల అరెస్ట్

గుర్రంపోడు: మండలంలోని కొప్పోలు గ్రామ శివారులో పేకాట స్థావరంపై గురువారం పోలీసులు దాడి చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఐ పసుపులేటి మధు తెలిపిన వివరాల ప్రకారం.. కొప్పోలు గ్రామ శివారులో బల్గూరి నగేష్‌కు చెందిన బత్తాయి తోటలో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో పోలీసులు దాడి చేసి నిరసనమెట్ల లవకుమార్, బెజవాడ మహేష్ అనే ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి పరారయ్యారు. పట్టుబడిన వారి వద్ద నుంచి రూ.3వేల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గరిడేపల్లిలో..

గరిడేపల్లి: మండల పరిధిలోని కొత్తగూడెం గ్రామంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని గురువారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు. అరెస్టయిన వారిలో కొత్తగూడెం గ్రామానికి చెందిన కత్తి సోమయ్య, నకిరేకంటి నాగరాజు, నకిరేకంటి రమేష్, నకిరేకంటి ప్రసాద్, నకిరేకంటి అంజయ్య ఉన్నారు. వారి వద్ద నుంచి రూ.15,100 నగదు, మూడు బైక్‌లు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పోచంపల్లిలో 'నిఫ్ట్' విద్యార్థుల సందడి


పోచంపల్లిలో ఫ్యాషన్ డిజైన్ విద్యార్థుల బృందం

భూదాన్‌పోచంపల్లి: హైదరాబాద్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ(నిఫ్ట్)లో ఫ్యాషన్ డిజైన్ కోర్సు అభ్యసిస్తున్న ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, గుజరాత్, కర్ణాటక, రాజస్తాన్, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు చెందిన 37 మంది విద్యార్థులు స్టడీ టూర్‌లో భాగంగా గురువారం పోచంపల్లికి వచ్చారు. ఇక్కడ చేనేత సహకార సంఘం, కళాపునర్వి హ్యాండ్లూమ్ యూనిట్‌ను సందర్శించారు. నూలు, చిటికి కట్టడం, వార్పు, గ్రాఫ్‌పై డిజైనింగ్ చేయడం, టై అండ్ డై విధానం ద్వారా రంగులద్దకం, మగ్గాలను పరిశీలించారు. నూలు ఎక్కడి నుంచి దిగుమతి చేసుకుంటారని, తయారు చేసిన వస్త్రోత్పత్తులను ఎలా మార్కెటింగ్ చేస్తారని, కార్మికులకు లభిస్తున్న గిట్టుబాటు ధర, పోచంపల్లి ఇక్కత్‌కు ఉన్న ప్రాముఖ్యతను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నిఫ్ట్ ప్రొఫెసర్లు డాక్టర్ సశ్మిత పాండా, జ్యోతిర్మయి మాట్లాడుతూ..


రంగులద్దకం విధానాన్ని తెలుసుకుంటున్న ఫ్యాషన్ డిజైన్ విద్యార్థులు

ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులో భాగంగా థియరీ చదువుకున్న విద్యార్థులకు చేనేత వస్త్రాల తయారీ విధానాలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు పోచంపల్లి సందర్శనకు వచ్చామని పేర్కొన్నారు. పోచంపల్లి పర్యటన విద్యార్థులందరికి మంచి అనుభూతిని ఇచ్చిందని అన్నారు.

అడవి దున్న హల్‌చల్


అడవి దున్న

ఆత్మకూరు(ఎం): మండలంలోని పల్లెర్ల గ్రామంలో గురువారం అడవి దున్న హల్‌చల్ చేసింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పల్లెర్ల గ్రామానికి చెందిన యుముడాల నరేష్ తన గొర్రెలు, మేకలను మేపేందుకు గ్రామ సమీపంలోని పెసర్లబండ వద్దకు వెళ్లాడు. ఒక మేక తప్పిపోవడంతో దానిని వెతకడానికి పక్కనే ఉన్న జామాయిల్ తోటలోకి వెళ్లాడు. ఈ క్రమంలో అతడి పైకి ఒక్కసారిగా అడవి దున్న దూసుకురావడంతో పరుగు పరుగున వచ్చి గ్రామస్తులకు సమాచారం ఇచ్చాడు. గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఫారెస్ట్ అధికారి పద్మజారాణి, ఇన్‌స్పెక్టర్ సతీష్‌బాబు, ఎస్‌ఐ ఎస్. కృష్ణయ్య గ్రామానికి చేరుకుని అడవి దున్నను పట్టుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. గ్రామస్తులు వెంటబడటంతో అడవి దున్న సమీపంలో ఉన్న వెంచర్ పక్కన చెట్ల పొదల్లో దాగి ఉంది. రాత్రయినా అడవి దున్న దొరకలేదని, అది ఎక్కడి నుంచి వచ్చిందో స్పష్టంగా తెలియడంలేదని ఫారెస్ట్ అధికారులు తెలిపారు. విద్యుత్ లైట్లను ఏర్పాటు చేసి అడవి దున్న కదలికలను కనిపెడుతున్నారు.


పల్లెర్ల గ్రామంలో ఫారెస్ట్ అధికారులు

వాగులో పడిపోయిన దంపతులు

ఆలేరురూరల్: బైక్‌పై వెళ్తున్న దంపతులు కాజ్‌వే పైనుంచి వాగులో పడిపోవడంతో గాయాలయ్యాయి. హైదరాబాద్‌లోని బండ్లగూడకు చెందిన దేవదాసు, అతని భార్య దేవేంద్ర గురువారం బైక్‌పై మద్దూరులో తన బంధువుల ఇంటికి వెళ్లారు. సాయంత్రం ఆలేరుకు తిరిగి వస్తున్న క్రమంలో కొలనుపాక వాగు కాజ్‌వేపై ఎదురుగా వాహనాలు రావడంతో ప్రమాదవశాత్తు వాగులో పడిపోయారు. అక్కడున్న స్థానికులు, పోలీసులు వారిని బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు.


దంపతులను బయటకు తీస్తున్న స్థానికులు

ఇంగ్లిష్ ప్రయోగ పరీక్షలకు వేళాయే

• నేడు ఇంటర్ ప్రథమ, రేపు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నిర్వహణ
• ఆంగ్లభాషా నైపుణ్యాలు పెంపొందించడమే లక్ష్యం
• చదువుకునే కళాశాలలోనే రాసేలా ఏర్పాట్లు

హుజూర్‌నగర్ : ఇంటర్మీడియట్ విద్యపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇంటర్ స్థాయిలోనే విద్యార్థుల్లో ఆంగ్ల భాషా నైపుణ్యాలు పెంపొందించేందుకు గత ఏడాది నుంచి ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఆంగ్ల ప్రయోగ పరీక్షలు నిర్వహిస్తోంది. గతేడాది ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థులకు ప్రాక్టికల్స్ జరిగాయి. ఈ ఏడాది ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించనున్నారు. థియరీ పరీక్షకు 80 మార్కులు, ప్రయోగ పరీక్షకు 20 మార్కులు కేటాయించారు. ఇంగ్లిష్ ప్రాక్టికల్స్‌లో కనీసం మార్కులు సాధించే వారే ఉత్తీర్ణులవుతారు. గైర్హాజరైన వారిని ఇంగ్లిష్ పరీక్ష అనుత్తీర్ణులైనట్లు పరిగణిస్తారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఈనెల 31న, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఫిబ్రవరి 1న ప్రయోగ పరీక్షలు ఉంటాయి. జిల్లాలో ప్రభుత్వ ఆధీనంలో నడిచే అన్ని రకాల కళాశాలలు, ప్రైవేటు కళాశాలలు కలిపి 74 ఉన్నాయి. వాటిలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 8,638 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 8,309 మంది ఉన్నారు. వీరంతా ఆంగ్ల ప్రయోగ పరీక్షలకు హాజరు కానున్నారు.

ఐదు అంశాల్లో పరీక్షలు

ఆంగ్ల భాషా నైపుణ్యాలపై విద్యార్థుల ప్రతిభను తరగతిగదిలోనే పరీక్షిస్తారు. మొత్తం ఐదు అంశాల్లో వారికి పరీక్షలు ఉంటాయి. ఒక్కో దానికి నాలుగు మార్కులు ఉంటాయి. అవి ఏమిటంటే

- ఏదైనా సబ్జెక్టుపై ఇద్దరు, అంతకంటే ఎక్కువ మంది విద్యారుల మధ్య సంభాషణ.
- ఒక సబ్జెక్టుపై నిమిషం వ్యవధిలోపు అనర్గళంగా మాట్లాడటం.
- తల్లిదండ్రుల నేపథ్యం లేదా ఆసక్తిగల ఇంకేదైనా అంశంపై విద్యార్థుల బృంద చర్చ.
- గ్రాహక శక్తి.
- రికార్డు బుక్.

ఆయా అంశాల్లో చూపిన ప్రతిభ ఆధారంగా వారికి మార్కులు కేటాయిస్తారు.

అన్ని గ్రూపుల విద్యార్థులు రాయాల్సిందే..

ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు సంబంధించి అన్ని గ్రూపుల విద్యార్థులు ఆంగ్ల ప్రయోగ పరీక్షలు విధిగా రాయాలి. విద్యార్థులకు వారు చదువుకునే కళాశాలల్లోనే ఈ పరీక్షలు నిర్వహిస్తారు. పరీక్షల నిర్వహణపై ఆయా కాలేజీల యాజమాన్య ప్రతినిధులు, ప్రిన్సి పాళ్లు, సబ్జెక్టు అధ్యాపకులకు దిశానిర్దేశం చేశాం.

– భానూ నాయక్, డీఐఈఓ, సూర్యాపేట

ఆర్థిక ఇబ్బందులతో కానిస్టేబుల్ బలవన్మరణం


వెంకటేశ్వర్లు (ఫైల్)

చిలుకూరు: చిలుకూరు మండల పరిధిలోని రామాపురం గ్రామానికి చెందిన ఆరె. వెంకటేశ్వర్లు(42) హైదరాబాద్‌లోని మాదన్నపేట్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అతడు కుటుంబ సభ్యులతో కలిసి అంబర్‌పేటలోని దుర్గానగర్‌లో నివాసముంటున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా గురువారం ఇంట్లో చున్నీతో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ బంధువులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

చౌటపల్లి స్త్రీనిధిలో నిధుల గోల్‌మాల్

• విచారణ జరుపుతున్న ఐకేపీ అధికారులు

మఠంపల్లి: మండలంలోని చౌటపల్లి స్త్రీనిధిలో రూ.30లక్షల గోల్‌మాల్ జరిగినట్లు తెలుస్తోంది. మఠంపల్లి మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో పనిచేసే మేనేజర్ శైలజ గురువారం గ్రామంలో విచారణ చేపట్టారు. చౌటపల్లిలో సుమారు 23 మహిళా సంఘాలు ఉండగా.. వారు తీసుకున్న రుణాలకు సంబంధించిన వడ్డీని ప్రతి నెలా బ్యాంకులో జమచేసేందుకు సంబంధిత వీఓఏకు ఇవ్వగా.. కొంతకాలంగా వడ్డీని వీఓఏ బ్యాంకులో జమచేయడంలేదని తేలింది. మేనేజర్ శైలజ 12 సంఘాల పరిధిలోని ఖాతాలను పరిశీలించి రూ.13.99లక్షలు జమచేయకుండా సదరు వీఓఏ దుర్వినియోగం చేసినట్లు విచారణలో తేల్చారు. ఈ విషయమై మండల ఏపీఎం సౌజన్య మాట్లాడుతూ.. చౌటపల్లి స్త్రీ నిధిలో 12 సంఘాల పరిధిలో విచారణ జరిగిందని, మరో 11 సంఘాలలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

సరైన కొలువు దక్కలేదని ఆత్మహత్య

• సాగర్‌కాల్వలో దూకి ఆత్మహత్య చేసుకున్న జూనియర్ అసిస్టెంట్
• మంగళవారం రాత్రి మిస్సింగ్.. గురువారం కాల్వలో మృతదేహం గుర్తింపు


ప్రవీణ్‌కుమార్ (ఫైల్)

మిర్యాలగూడ అర్బన్: తను చదువుకున్న చదువుకు.. చేసే కొలువుకు సంబంధం లేని ఉద్యోగం.. వచ్చిన ఉద్యోగం చేసేందుకు ఇష్టం లేని యువకుడు సాగర్ కాల్వలో పడి ఆత్మహత్య చేసుకున్నాడు. త్రిపురారం మండలం బెజ్జికల్ గ్రామానికి చెందిన నూనె రాములు, నిర్మల రెండవ కుమారుడు ప్రవీణ్‌కుమార్ (30) బీటెక్ పూర్తి చేసి గ్రూప్–4 పరీక్ష ఫలితాల్లో మెరిట్ సాధించాడు. దీంతో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపికై గత డిసెంబర్ 28న మిర్యాలగూడ తహశీల్దార్ కార్యాలయంలో ఉద్యోగంలో చేరి మిర్యాలగూడ పట్టణంలో నివాసం ఉంటున్నాడు. అయితే ప్రవీణ్ ఉద్యోగంలో చేరిన సమయంలోనే ప్రభుత్వ సంక్షేమ పథకాల క్షేత్రస్థాయి సర్వే ప్రారంభం కావడంతో క్షేత్ర స్థాయిలో పని ఒత్తిడి పెరిగి మానసికంగా ఇబ్బంది పడుతున్నట్లు పలు సందర్భాల్లో తన తల్లిదండ్రులతో చెప్పుకున్నాడు. అయితే తెలంగాణ జెన్‌కో నిర్వహించిన పరీక్షలో విద్యుత్ ఏఈ పోస్టు ఇంటర్వ్యూకు 1:2 లో ఎంపికైన అతడు కొద్ది తేడాతో ఏఈ ఉద్యోగం చేజారింది. దీంతో తీవ్ర మానసిక క్షోభకు గురయ్యాడు. అంతే కాకుండా వచ్చే నెలలో గ్రూప్స్ రిజల్ట్స్ కూడా ఉండటంతో తాను కచ్చితంగా గ్రూప్స్ సాధిస్తాననే నమ్మకం ఉందని.. ఈ ఉద్యోగం వదిలేస్తానని తల్లిదండ్రులకు చెప్పినట్లుగా తెలుస్తుంది. అయితే గ్రూప్స్ ఉద్యోగం వచ్చే వరకు ఎలాగైనా ఓపిక పట్టుకుని ఉండమని తల్లిదండ్రులు అతడిని సుముదాయించారు. ఉన్నత చదువులు తనకు చదవుకు తగ్గ కొలువు దక్కలేదని గత కొద్ది రోజులుగా తన తోటి సిబ్బంది వద్ద వాపోయేవాడని కూడా కార్యాలయంలో చర్చించుకుంటున్నారు. ఈ క్రమంలో మంగళవారం డ్యూటీకి వచ్చిన ప్రవీణ్‌కుమార్ రాత్రి ఇంటికి ఫోన్‌చేసి తల్లితో తన బాధను చెప్పగా.. ఎప్పటిలాగే వారు సర్దిచెప్పారు. అయితే, బుధవారం ప్రవీణ్‌కుమార్‌కు తల్లిదండ్రులు ఎన్నిసార్లు ఫోన్‌చేసినా కలవకపోవడంతో అనుమానం వచ్చిన తల్లిదండ్రులు మిర్యాలగూడ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు మంగళవారం రాత్రి 11గంటల సమయంలో వేములపల్లి సమీపంలోని సాగర్ కాల్వ వద్ద చివరి సారిగా సెల్‌ఫోన్ సిగ్నల్స్ చూపించాయి. ప్రవీణ్‌కుమార్ స్కూటీ సాగర్ కాల్వ వద్ద నిలిపి ఉంచడంతో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. గురువారం దొండవారిగూడం వద్ద సాగర్‌కాల్వలో ప్రవీణ్‌కుమార్ మృతదేహం గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగా, జూనియర్ అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్‌ది అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సైదిరెడ్డి తెలిపారు.